సాక్షి నల్లగొండ

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



ధర లేక 'చింత'

చింతపండుకు గిట్టుబాటు ధర లేక రైతులు దిగాలు పడుతున్నారు. రైతులు, వ్యాపారులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. - IIలో



నీటి విడుదల.. రైతుల ఆందోళన

డిండి ప్రాజెక్టు నుంచి ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయగా.. నీటిని నిలిపివేయాలని రైతులు ఆందోళన చేశారు. - IIలో



అమ్మకానికి ఆడ శిశువు

పసిపాపను అమ్మకానికి పెట్టి.. డబ్బులు పొందాలని చూసిన ముఠా సభ్యులను మునగాల పోలీసులు అరెస్ట్ చేశారు. - IIలో

న్యూస్‌రీల్

మంత్రి శ్రీరామనవమి శుభాకాంక్షలు

నల్లగొండ: రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామచంద్రుడు ధర్మసంస్థాపన, విలువల ప్రతిష్టాపన, పితృవాక్యపరిపాలన వంటి సద్గుణాలను సమాజానికి అందించారని ఆయన గుర్తుచేశారు. ఆ యుగపురుషుడు నడిచిన బాటలో నడిచి సంక్షేమ రాజ్యస్థాపనలో, విలువలు కలిగిన సమాజ నిర్మాణంలో భాగం అవుదామని మంత్రి ప్రజలను కోరారు.

నకిలీ స్కీంలలో పెట్టుబడులు పెట్టి మోసపోకండి

- ఎస్పీ చందనా దీప్తి సూచన

నల్లగొండక్రైం: మోసపూరిత నకిలీ స్కీంలలో పెట్టుబడులు పెట్టి ప్రజలు మోసపోవద్దని జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఒక ప్రకటనలో సూచించారు. చైన్ లింకులతో పెట్టుబడులు పెట్టిన తరువాత మొదటగా కొంత ఇస్తూ ఆశ చూపించి అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టిన తరువాత వాటిని ఎత్తేస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఇలా మోసపోయామని తమ వద్దకు కేసులు వస్తున్నాయన్నారు. సోషల్ మీడియా వాట్సాప్‌ల ద్వారా నిరుద్యోగులను ఆసరా చేసుకుని నకిలీ ఉద్యోగాల పేరిట డబ్బులు వసూళ్లు చేస్తూ మోసం చేస్తున్నారని, అలాంటి వాటికి స్పందించి మోసపోవద్దని సూచించారు. ఏదేని మోసం జరిగితే, సమస్యలు వస్తే 100కు ఫోన్ చేయాలని తెలిపారు.

లక్ష్యాన్ని అధిగమించాలి



చీమలగడ్డలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద డీఎస్‌వో వెంకటేశ్వర్లు

నకిరేకల్: ధాన్యం కొనుగోలులో నిర్దేంచిన లక్ష్యాన్ని అధిగమించామని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, తూకాల్లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. నకిరేకల్‌లోని చీమలగడ్డలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు లక్ష టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామని, రూ.80 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జమురుద్దీన్, డీటీసీఎస్ జ్యోతి, కేంద్రం ఇంచార్జి నాగరాజు, రాజు ఉన్నారు.

పాఠశాలలు సందర్శించిన డీఈఓ

రామగిరి(నల్లగొండ): జిల్లా విద్యా శాఖ అధికారి భిక్షపతి మంగళవారం తిప్పర్తి బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీని సందర్శించారు. 6 నుంచి 9వ తరగతి వరకు జరుగుతున్న పరీక్షలను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ నెల 21 పరీక్షలు పూర్తవుతున్నందున మూల్యాంకనం పూర్తి ఫలితాలను వెలువరించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తరాదు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కట్టంగూర్ : వేసవిలో గ్రామాల్లో, పట్టణాల్లో అధికారులు నిరంతరం పర్యవేక్షించి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కట్టంగూరు ఎంపీడీఓ కార్యాలయంలో నకిరేకల్, కట్టంగూర్ మండలాల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నల్లాల నుంచి వచ్చే తాగునీరు వృథా కాకుండా చూడాలని, నీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రం చేయాలన్నారు. వేసవికాలంలో రెండు నెలలపాటు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. హరితహారం మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలని, మూగజీవాలకు పశువుల తొట్టిలో నీరు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు పనుల వద్ద, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ అదనపు పీడీ కె.నవీన్‌కుమార్, ఎంపీడీఓలు జ్ఞానప్రకాశ్‌రావు, చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నర్సింహ, ఏఈ జె.నవీన్, ఏపీఓలు కడియం రాంమోహన్, రమణయ్య, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.



వైభవంగా ఎదుర్కోలు మహోత్సవం

నల్లగొండ పట్టణం రామగిరిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల తరపున భక్తులు పెద్దలుగా వ్యవహరించారు.

– రామగిరి(నల్లగొండ)

ఎదుర్కోలు వేడుకలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

రేపటి నుంచి నామినేషన్లు

- పార్లమెంట్ ఎన్నికలకు గురువారం వెలువడనున్న నోటిఫికేషన్
- ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు నామినేషన్ల స్వీకరణ
- ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసేలా ఏర్పాట్లు
- ఏఆర్‌వో కార్యాలయాల్లోనూ అందుబాటులో నామినేషన్ ఫారాలు
- నామినేషన్ల దాఖలుకు 25వ తేదీ చివరి గడువు
- నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో 17.22 లక్షల మంది ఓటర్లు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ హరిచందన, పక్కన ఎస్పీ చందనాదీప్తి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 18వ తేదీన విడుదల కానుంది. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి నల్లగొండ కలెక్టరేట్‌లోని ఆర్‌వో కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ప్రతి అభ్యర్థి ఫారం–2ఎ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లను దాఖలు చేయవచ్చు. వాటిని అభ్యర్థి లేదా అభ్యర్థి తరపున మరెవరైనా దాఖలు చేయవచ్చు. ప్రతి అభ్యర్థి తనపై ఉన్న క్రిమినల్ కేసులు, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలకు సంబంధించి ఫారం–26ను దాఖలు చేయాలి. పోటీ చేసే అభ్యర్థి అదే నియోజకవర్గానికి చెందినవారు కాకపోతే తాను ఏ నియోజకవర్గంలో ఓటరో దానికి సంబంధించిన సర్టిఫైడ్ కాపీని సంబంధిత ఆర్‌వో నుంచి తీసుకొచ్చి దాఖలు చేయాలి. అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చులకు సంబంధించి వివరాల కోసం ప్రత్యేకంగా బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయాలి.

పెరిగిన యువ ఓటర్లు

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో గతంలో 18–19 ఏళ్ల మధ్య వయసున్న యువ ఓటర్లు 50 వేల వరకు ఉండగా.. ఇప్పుడు వారి సంఖ్య 60,116కు పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీనియర్ సిటిజన్ ఓటర్లుగా 80 ఏళ్లు దాటిన వారిని పరిగణనలోకి తీసుకోగా, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 85 ఏళ్ల వయసు దాటిన వారిని సీనియర్ సిటిజన్ ఓటర్లుగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రస్తుతం నల్లగొండ పరిధిలో అలాంటి వారు 9,587 మంది ఉన్నట్లు గుర్తించారు. శారీరక వైకల్యం కలిగిన ఓటర్లు 33,865 మంది ఉండగా, ఓవర్సీస్ (ఎన్‌ఆర్‌ఐ) ఓటర్లు 180 మంది ఉన్నారు.

403 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

ఈ నియోజకవర్గ పరిధిలోని 1436 ప్రాంతాల్లో 2061 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో 505, గ్రామీణ ప్రాంతాల్లో 1556 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వాటిల్లో 403 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు.

100 మీటర్ల వరకే అనుమతి

నామినేషన్ల స్వీకరణ సందర్భంగా 100 మీటర్ల పరిధిలో ఇతరులకు అనుమతి ఉండదని ఆర్‌వో దాసరి హరిచందన పేర్కొన్నారు. అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులు, మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అన్ని బృందాలు, నోడల్ ఆధికారుల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. సభలు, ర్యాలీలు, సమావేశాలకు సువిధ యాప్ ద్వారా, లేదంటే ఏఆర్‌వో కార్యాలయాల్లో అనుమతులు తీసుకోవాలన్నారు.

ఎనిమిది చెక్‌పోస్టులు : ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మూడు అంతర్రాష్ట్ర, 5 అంతర్ జిల్లా చెక్‌పోస్టుల తో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి పేర్కొన్నారు. వాడపల్లి, నాగార్జునసాగర్, అడవిదేవులపల్లి చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఏ చిన్న అనుమానం వచ్చినా తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 184 కేసుల్లో రూ.9.18 కోట్ల విలువైన నగదు ఆభరణాలు సీజ్ చేశామన్నారు.

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటర్ల సంఖ్య

అసెంబ్లీ నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
దేవరకొండ(ఎస్టీ)	131659	130392	18	262069
నాగార్జునసాగర్	115710	120464	21	236195
మిర్యాలగూడ	115543	120299	26	235868
హుజూర్‌నగర్	121667	129164	17	250848
కోదాడ	119068	125878	18	244964
సూర్యాపేట	118770	124893	13	243676
నల్లగొండ	121079	127766	56	248901
మొత్తం	843496	878856	169	1722521

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి చేశాం

- కలెక్టర్ దాసరి హరిచందన

18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. ప్రభుత్వ పని దినాల్లోనే నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ఏఆర్‌వో కేంద్రాల్లో నామినేషన్ ఫారాలను అందుబాటులో ఉంచామని, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. సగటున కనిష్టంగా 836 మంది, గరిష్టంగా 1029 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్న 43 ప్రాంతాల్లో యాక్సిలరీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గతంలో పోలింగ్ కేంద్రాలున్న 20 భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఆ కేంద్రాలను మార్పు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, లైటింగ్, టాయ్‌లెట్స్, వైద్య సదుపాయాలు, రవాణ సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పార్లమెంట్ పరిధిలో 17.22 లక్షల మంది ఓటర్లు ఉండగా, 736 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని తెలిపారు.

దేశంలో కాంగ్రెస్ గాలి వీస్తోంది

- రాహుల్‌గాంధీ ప్రధాని అవడం ఖాయం
- కేసీఆర్, కేటీఆర్‌లకు మతిభ్రమించింది
- రఘువీర్‌రెడ్డిని లక్ష మెజారిటీతో గెలిపించాలి
- మిర్యాలగూడ కాంగ్రెస్ సమావేశంలో ఉత్తమ్, కోమటిరెడ్డి, జానా



సమావేశంలో మాట్లాడుతున్న జానారెడ్డి

మిర్యాలగూడ: బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టేందుకు సిద్ధమయ్యారని, దేశంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుందని రాష్ట్ర భారీ నీటి పారుదల, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణను అవమానించి హేళన చేసిన ఘనత ప్రధానమంత్రి మోదీకే దక్కుతుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఊసేలేదని, బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు దూరమయ్యారని, ఆ పార్టీల పట్ల ప్రజలకు నమ్మకం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణాలో బీజేపీ ప్రభుత్వం ఒక్క రూపాయి పని కూడా చేయలేదని, ఒక ఇల్లు కూడా కట్టలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను కూడా అమలు చేయడంలో మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ పని ఖతం అయిందన్నారు. ఎమ్మెల్సీ కవిత జైలుకు పోవడంతో తండ్రి కేసీఆర్, సోదరుడు కేటీఆర్‌లకు మతిభ్రమించిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత రేవంత్‌రెడ్డి బీజేపీలోకి పోతాడని అసత్యపు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కుర్చీ వేసుకొని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్న కేసీఆర్ ఇప్పుడు ముసలి వయస్సులో కట్టె పట్టుకొని నడుస్తున్నాడని ఎద్దేవా చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆసియాలోనే నెంబర్ వన్ బిజినెస్ సెంటర్ మిర్యాలగూడకు ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ భారతీరాగ్యానాయక్, స్కైలాబ్‌నాయక్, గాయం ఉపేందర్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, తలకొప్పుల సైదులు, రామలింగయ్య, కృష్ణయ్య, నందిని, సునీత, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



సన్నాహక సమావేశానికి ర్యాలీగా వస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

నామినేషన్లపై సిబ్బందికి అవగాహన ఉండాలి

- కలెక్టర్ హరిచందన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన, పక్కన అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ

నల్లగొండ: నామినేషన్ల స్వీకరణలో సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. నామినేషన్ల స్వీకరణకు నియమించిన అధికారులు, సిబ్బందితో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు సమర్పించే బ్యాంకు ఖాతా, ఫొటోగ్రాఫ్, ప్రతిపాదకులు తదితర అంశాలకు సంబంధించి సూచనలు చేశారు. నామినేషన్లపై సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, ప్రతిరోజూ ఎన్నికల సంఘానికి పంపించే నివేదికలు జాగ్రత్తగా పరిశీలించి పంపాలని చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధంగా ఉండాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు యంత్రాంగాలు సిద్ధంగా ఉండాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. ఆమె మంగళవారం వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల యంత్రాంగంతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల నుంచి అవసరమైన సిబ్బంది వివరాలను, అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్స్‌ల వివరాలను సమర్పించాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికలలో నోడల్ అధికారులుగా వ్యవహరించిన వారినే ఎమ్మెల్సీ ఎన్నికలకు నోడల్ అధికారులుగా నియమించాలన్నారు. ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలను ఆమె తెలియజేస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల నిర్వహణకు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాల కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

పెద్దఅడిశర్లపల్లి: తాగునీటి అవసరాల కోసం ఏఎమ్మార్పీ నుంచి ఉదయ సముద్రానికి నీటి విడుదల కొనసాగుతోంది. ఈ నెల 2 నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ వెనుక జలాల నుంచి 800 క్యూసెక్కుల నీటిని లింక్ కెనాల్ ద్వారా ఏకేబీఆర్‌కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అక్కడి నుంచి మెయిన్ కెనాల్ ద్వారా హైదరాబాద్ జంట నగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 45 క్యూసెక్కుల, ఉదయ సముద్రానికి 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ జీజేవీ సత్యనారాయణ తెలిపారు. సాగర్ వెనుక జలాలలో ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ మోటార్ల బిగింపు పనులు పూర్తి కావొస్తున్నాయని, రెండు రోజుల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తామని హైదరాబాద్ జలమండలి అధికారులు తెలిపారు.

సివిల్స్‌లో ధీరుడు

- యూపీఎస్సీ ఫలితాల్లో 173వ ర్యాంకు సాధించిన అల్వాల వాసి
- నాలుగో ప్రయత్నంలో సక్సెస్ అయిన ధీరజ్‌రెడ్డి
- తల్లిదండ్రుల కల నెరవేర్చిన యువకుడు



తల్లిదండ్రులు, సోదరితో ధీరజ్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): సివిల్స్ సాధించాలన్న తల్లిదండ్రుల కలలను నెరవేర్చడానికి ఆ యువకుడు అహర్నిశలు కష్టపడి చదివాడు. మూడు సార్లు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. అయినా నిరాశ చెందకుండా నాలుగోసారి ప్రయత్నించి సక్సెస్ అయ్యాడు. అతనే నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన పెంకీసు ధీరజ్ రెడ్డి. మంగళవారం ప్రకటించిన యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 173వ ర్యాంక్ సాధించాడు. పెంకీసు సత్యనారాయణరెడ్డి, హేమలత దంపతుల కుమారుడైన ధీరజ్‌రెడ్డి ప్రాథమికోన్నత విద్యాభ్యాసం నల్లగొండలో, ఇంటర్ నుంచి డిగ్రీ వరకు హైదరాబాద్‌లో కొనసాగింది.

ప్రజాసేవ చేయాలని..

ధీరజ్ తండ్రి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా, తల్లి స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో అతడిని సివిల్స్‌వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించారు. హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటూ ప్రయత్నాలు మొదలు పెట్టాడు. 2019, 2021, 2022లో మూడు పర్యాయాలు ప్రయత్నించి విఫలమయ్యాడు. అయినా అతడు వెనకడుగు వేయలేదు. సడలని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాడు. నాలుగో ప్రయత్నంలో విజయం ఆయన సొంతమైంది.

విద్యను ఆస్తిగా ఇవ్వాలి

– సత్యనారాయణరెడ్డి, ధీరజ్‌రెడ్డి తండ్రి

తల్లిదండ్రులు పిల్లలకు విద్యను ఆస్తిగా ఇవ్వాలి. చదువు అనేది చాలా విలువైనది. పిల్లలకు తల్లిదండ్రుల నుంచి ప్రోత్సాహం లభించినప్పుడే ఏదైనా సాధించగలను అనే నమ్మకం వారిలో కలుగుతుంది.

బీర్లు.. నో స్టాక్!

- జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో కొరత
- కోరుకున్న కంపెనీ బీర్లు దొరకడం లేదని మద్యం ప్రియుల ఆవేదన
- లిక్కర్‌కు పెరిగిన డిమాండ్



మద్యం దుకాణం వద్ద కింగ్‌ఫిషర్ లైట్ బీర్లు స్టాక్ లేదని ఏర్పాటు చేసిన బోర్డు

నల్లగొండ రూరల్: జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల్లో బీర్ల కొరత ఏర్పడింది. చాలా వరకు వైన్స్‌ల ఎదుట ‘బీర్లు.. నో స్టాక్’ బోర్డులు కనిపిస్తున్నాయి. దీంతో లిక్కర్‌కు డిమాండ్ పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 155 మద్యం దుకాణాలు, 21 బార్లు ఉండగా.. నల్లగొండలోని లిక్కర్ డిపోకు వచ్చిన బీర్లను ఎక్సైజ్ అధికారులు ఒక్కో మద్యం దుకాణానికి రోజుకు 80 పెట్టెల (ఒక పెట్టెలో 12 బీర్లు) చొప్పున సరఫరా చేస్తున్నారు. వేసవికి తోడు ఈ నెలలో శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో బీర్లకు డిమాండ్ పెరిగింది. కానీ, మద్యం ప్రియులకు వారు కోరుకున్న కంపెనీ బీర్లు లభించడం లేదు. మద్యం షాపుల వద్ద కేవలం ఫలానా కంపెనీకి చెందిన బీర్లు మాత్రమే ఉన్నాయనే బోర్డులు పెడుతున్నారు. అవి కూడా నిమిషాల వ్యవధిలోనే అమ్ముడుపోతున్నాయి. కోరుకున్న బీర్లు దొరక్కపోవడంతో మద్యం ప్రియులు లిక్కర్ కొనుగోలు చేస్తున్నారు. దీంతో గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో లిక్కర్ అమ్మకాలు పెరిగాయి. ఇదే అదునుగా కొన్ని ప్రాంతాల్లో బెల్టు షాపుల్లో ఎక్కువ ధరకు బీర్లు అమ్ముతున్నట్లు సమాచారం.

డిమాండ్‌కు తగినట్లుగా లేని సరఫరా

నల్లగొండలోని లిక్కర్ డిపో నుంచి నల్లగొండ జిల్లాలోని 155 వైన్స్‌లు, 21 బార్లు, సూర్యాపేట జిల్లాలోని 99 వైన్స్‌లు, 16 బార్లకు రోజుకు 20వేల నుంచి 25వేల పెట్టెల బీర్లు సరఫరా చేస్తున్నామని ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. బీర్ల దిగుమతిలో తేడా లేదని, వేసవి కారణంగా బీర్లకు డిమాండ్ పెరగగా.. అందుకు తగినట్లుగా బీర్ల సరఫరా లేకపోవడంతో మద్యం షాపుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శమిస్తున్నాయని పేర్కొన్నారు.

పెరిగిన డిమాండ్..

మద్యం డిపోకు రోజు 20వేల నుంచి 25వేల పెట్టెల బీర్లు దిగుమతి అవుతున్నాయి. ఈ బీర్లను అన్ని షాపులకు రేషన్ ప్రకారం సరఫరా చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లిక్కర్ డిపో నుంచి మద్యం దుకాణాలకు 1,30,379 పెట్టెల బీర్లు సరఫరా చేయగా.. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 1,62,227 పెట్టెల బీర్లు సరఫరా చేశారు. గతేడాది ఏప్రిల్ నెలతో పోల్చితే ఈసారి 31,848 పెట్టెల బీర్లు అదనంగా సరఫరా చేశారు. గతేడాది ఏప్రిల్ నెలలో మొదటి 15 రోజులకు గాను రూ.21.25కోట్ల ఆదాయం రాగా ఈ ఏడాది ఏప్రిల్ నెల మొదటి 15 రోజుల్లో రూ.27.25కోట్ల ఆదాయం లభించింది. మొత్తంగా ఈ ఏడాది రూ.6 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. అదే విధంగా గతేడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 75 వేల పెట్టెల లిక్కర్ అమ్మడం ద్వారా రూ.57.20కోట్ల ఆదాయం రాగా ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఒక లక్షా 31 వేల పెట్టెల లిక్కర్ అమ్మడం ద్వారా రూ.93.75కోట్ల ఆదాయం వచ్చింది. లిక్కర్ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ నెల మొదటి 15 రోజుల్లో రూ.36.55కోట్ల ఆదాయం అదనంగా సమకూరింది.

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

నల్లగొండ రూరల్: నిరుద్యోగులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ నిర్వాహకురాలు ఆల్మస్ ఫర్హీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, సెక్టార్ రెడీనెస్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై రెండు నెలలు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టెన్త్, డిగ్రీ(పాస్/ఫెయిలై) చదివి, 35ఏళ్ల లోపు గల వారు ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 7032649925, 9177785283 నంబర్లను సంప్రదించాలన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

సూర్యాపేట: జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువులో మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు గల మహిళ మృతదేహం సద్దుల చెరువులో తేలియాడుతుంటం గమనించిన స్థానికులు తమకు సమాచారం అందజేశారని సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. మృతురాలు నాలుగున్నర ఫీట్ల పొడవు ఉండి, నీలం రంగు చీర, నారింజ రంగు జాకెట్ ధరించిందని, కుడి చేతిపై 'ఉమ' అని పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో లేదా 87126 86005, 85228 77882, 77939 50333 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో భద్రపరిచామన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


వంశీ (ఫైల్)

మునుగోడు: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మునుగోడు మండలంలోని కోతులారం గ్రామానికి చెందిన పగిళ్ల వంశీ(21) లారీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం లారీ డ్యూటీ దిగి ఇంటికి వచ్చిన వంశీ మంగళవారం ఉదయం 10గంటల వరకు ఇంటి వద్దే ఉండి ఆ తర్వాత కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఏమైందో ఏమో కానీ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి సమీపంలో ఇటుక బట్టీల వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి మధ్యాహ్నం సమయంలో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి 'నేను పురుగుల మందు తాగాను' అని చెప్పాడు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు వంశీని హైదరాబాద్‌కు తరలించగా.. అప్పటికే మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ధర లేక 'చింత'

- చింతపండుకు మార్కెట్‌లో డిమాండ్ లేక రైతుల దిగాలు
- గత ఏడాది క్వింటాకు రూ.14వేల పైచిలుకు ధర
- ఈ ఏడాది రూ.6వేలు నుంచి రూ.8వేలు మాత్రమే


భువనగిరి మార్కెట్‌కు వచ్చిన చింతపండు

భువనగిరి : చింతపండుకు ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక రైతులు దిగాలుపడుతున్నారు. మార్కెట్‌లో సరైన ధర రాకపోవడంతో రైతులు, వ్యాపారులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాపారులు చెల్లించే ధరతో రవాణా, కూలీలకే సరిపోతుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో గతకొద్ది రోజుల నుంచి భువనగిరి మార్కెట్‌కు వివిధ ప్రాంతాల నుంచి చింతపండును విక్రయించుకునేందుకు రైతులు తీసుకవస్తున్నారు.

ఆయా ప్రాంతాల నుంచి రాక..

చింతపండు భువనగిరి మార్కెట్‌కు జిల్లాలోని రాజాపేట, బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆత్మకూర్, మోత్కూర్, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు, గుండాల, అడ్డగూడూరుతో పాటు సిద్దిపేట జిల్లాలోని జగదేవ్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి విక్రయించేందుకు తీసుకువస్తుంటారు.

ఆందోళనలో రైతులు, వ్యాపారులు..

మార్కెట్‌కు రైతులతో పాటు కొంత మంది వ్యాపారులు చింతపండును విక్రయించేందుకు తీసుకవస్తారు. ఇందులో బేరగాళ్లు చెట్లను పట్టి వాటి నుంచి చింతపండును తీసుకుంటారు. వారు ఆయా చెట్లను సుమారు రూ. 7వేల నుంచి రూ.20వేల వరకు గుత్తకు తీసుకుని చెట్టు నుంచి చింతపండును తెంపేందుకు రోజుకు రూ.1000 నుంచి రూ.1200లు చెల్లిస్తున్నారు. చింతపండు వేరడానికి ఒక్కో కూలికి సుమారు రూ.350నుంచి రూ.400వరకు చెల్లిస్తున్నారు. ఎండిన అనంతరం చింతపండు నుంచి గింజలను వేరుచేసి గంపకు రూ.150గా చెల్లిస్తున్నారు. అనంతరం మార్కెట్‌కు తరలించే వరకు మొత్తంగా సుమారు రూ. 4500 నుంచి రూ.5వేల వరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం భువనగిరి మార్కెట్‌లో చింతపండు నాణ్యతను బట్టి రూ.6500నుంచి రూ.8వేల వరకు చెల్లిస్తున్నారు. దీంతో రైతులతో పాటు చెట్లను గుత్తకు తీసుకున్న బేరగాళ్లు దిగాలు చెందుతున్నారు.

గత ఏడాది రూ.14వేలు..

గత ఏడాది భువనగిరి మార్కెట్‌లో క్వింటా చింతపండు రూ.8వేల నుంచి రూ.14వేల వరకు చెల్లించారు. గత ఏడాది అధికంగా కొనుగోలు చేసిన వ్యాపారులు నిల్వలు చేసుకోవడంతో ప్రస్తుతం కొత్త చింతపండును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ ఏడాది క్వింటాలుకు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో చింతపండును చెట్ల మీదగానే వదిలివేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఖర్చులకైనా రావడం లేదు



మా పొలం వద్ద ఆరు చింత చెట్లు ఉన్నాయి. ఈ సారి చెట్లకు దిగుబడి కూడా తక్కువగానే ఉంది. చెట్ల నుంచి చింతపండును తెంపడం నుంచి మొదలు విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకెళ్లే వరకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో చింతపండుకు ధర గత ఏడాది కంటే తక్కువగా ఉంది. డబ్బులు అవసరం ఉండడంతో తక్కువ ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది. ఇంకా చింతపండు ఉంది. కాని తక్కువ ధర ఉండటంతో గిట్టుబాటుకావడంతో లేదు.

– అనసూయ, రైతు కుర్రారం, రాజాపేట మండలం

నల్లగా ఉందని ధర తక్కువ చెల్లిస్తున్నారు



చింతపండు నాణ్యతను బట్టి ధర చెల్లిస్తున్నారు. కూలీలను పెట్టి, రవాణా ఖర్చు భరించి చివరికి మార్కెట్‌కు విక్రయించేందుకు పండును తీసుకవస్తే ఇక్కడ ధర తక్కువగా చెల్లిస్తున్నారు. చింతపండు నల్లగా ఉందని సాకుతో క్వింటాకు రూ.6వేలు చెల్లించారు.

– మల్లారెడ్డి, రైతు వర్దూరు, మోటకొండూరు మండలం

అమ్మకానికి ఆడ శిశువు

- ఆరుగురి అరెస్ట్, పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట : పసిపాపను అమ్మకానికి పెట్టి.. డబ్బులు సంపాదించాలని చూసిన ముఠా సభ్యుల గుట్టును మునగాల పోలీసులు రట్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే వెల్లడించారు. ఈనెల 15న మునగాల మండల పరిధిలోని మొద్దులచెరువు స్టేజి వద్ద ఘర్షణ జరుగుతుందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో మునగాల పోలీసులు అక్కడకు వెళ్లారు. వెళ్లి వారిని విచారిస్తుండగా నిందితులు పారిపోవడానికి ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకుని మరింతగా విచారించారు. విచారణలో నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం నాయకునితండా గ్రామానికి చెందిన మేరావాత్ పూల్‌సింగ్ కూతురు రాజేశ్వరికి మొదటి సంతానంలో ఆడపిల్ల పుట్టగా తిరిగి రెండో సంతానంలో కూడా 20రోజుల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చింది. రాజేశ్వరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం కలగడంతో ఆమెకు ఆర్థికంగా ఇబ్బంది అవుతుందని భావించిన పూల్‌సింగ్ పుట్టిన పాపను పిల్లలు లేని వారికి అమ్మి డబ్బులు సంపాదిస్తే నా కూతురు బాగు పడుతుందని భావించాడు. ఈ నేపథ్యంలో తన కూతురు రాజేశ్వరికి విషయం చెప్పకుండా తన మేన కోడలు మేరావత్ దుర్గ సహకారంతో ముడావత్ రాజానాయక్‌తో పిల్లలను దత్తత చేసుకొనే వారి గురించి ఆరా తీసి పాపను అమ్మగా వచ్చిన డబ్బులలో కొంత డబ్బు తనకు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. పూల్‌సింగ్, దుర్గతో కలిసి ముడావత్ రాజానాయక్ తనకు పరిచయం ఉన్న శివనేని నాగమణితో ఒప్పందం చేసుకున్నారు. రాజానాయక్, నాగమణి ఇద్దరు కలిసి విజయవాడకు చెందిన గరికముక్కు విజయలక్ష్మి, వాడపల్లి అశోక్‌కుమార్ మధ్యవర్తులుగా రూ.3లక్షలకు అమ్మేటట్లు ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందంలో భాగంగా పాపను మునగాల మండలంలోని మొద్దులచెరువు స్టేజి వద్దకు తీసుకురావాలని రాజానాయక్, నాగమణి కోరడంతో పూల్‌సింగ్, దుర్గలు పాపతల్లి రాజేశ్వరికి మాయ మాటలు చెప్పి ఆమెతో పాటు ఈనెల 15న మొద్దులచెరువు స్టేజి దగ్గరలో గల ఖాళీ స్థలంలోకి వచ్చారు. ఆ సమయంలో పూల్‌సింగ్ తన కూతురు రాజేశ్వరి చేతుల నుంచి పాపను బలవంతంగా లాక్కొని విజయలక్ష్మి, అశోక్‌కుమార్‌లకు ఇవ్వడంతో రాజేశ్వరి గట్టిగా ప్రశ్నించగా మీ పాపను మీనాన్న మాకు రూ.3లక్షలకు అమ్మాడని చెప్పడంతో రాజేశ్వరి రోదించింది. తన పాపను తన దగ్గరకు తీసుకొనే ప్రయత్నం చేయగా వాళ్లు ఇవ్వకపోవడంతో గట్టిగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు చూసి అక్కడికి వెళ్లి విషయం తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకోవడంతో వారిని చూసి నిందితులు పారిపోతుండగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణలో ఆడపిల్లను అమ్మే ప్రయత్నం చేసినట్లు ఒప్పుకోగా.. నిందితులపై మునగాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి ఆరు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన షేక్ సాయిబీ, విజయవాడకు చెందిన బలగం సరోజ, మచిలీపట్నంకు చెందిన గంజల సింధు, హైదరాబాద్‌కు చెందిన నరేష్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ వీరరాఘవులు, మునగాల సీఐ డి.రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్‌ఐ అంజిరెడ్డి, సాయిప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

లోన్ ఇప్పిస్తానని టోకరా

రామన్నపేట: సైబర్ నేరస్తులు లోన్ ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.37,900 కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలంలోని పల్లివాడ గ్రామానికి చెందిన నాంపల్లి శ్రీనుకి మార్చి 23వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి రూ.10లక్షల లోన్ ఇప్పిస్తానని నమ్మించాడు. ఖర్చుల కోసం రూ.12వేలు తన ఖాతాకు పంపమని చెప్పాడు. ఇది నిజమని నమ్మిన శ్రీను రూ.11,900 ఆ వ్యక్తికి పంపాడు. మరుసటిరోజు మరికొంత డబ్బు కావాలని చెప్పడంతో మరో రూ.26వేలు పంపాడు. డబ్బు పంపిన తర్వాత సదరు వ్యక్తికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తాను మోయపోయానని తెలుసుకున్న శ్రీను సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం రామన్నపేట పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

యాదాద్రి ఆలయ రికార్డు అసిస్టెంట్ మృతి


మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న గ్యాదపాక బాల్‌నర్సింహ (42) మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. ఉదయం శ్వాస ఇబ్బందిగా ఉందని కుటుంబ సభ్యులతో చెప్పడంతో వెంటనే వారు భువనగిరి జిల్లా కేంద్రం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కొండపైనే వాహనాల పూజలు


కొండపైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఓ భాస్కర్‌రావు, అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలోనే వాహన పూజలు నిర్వహించేలా ఈఓ భాస్కర్‌రావు చర్యలు తీసుకున్నారు. ఈనేపథ్యంలో కొండపై గతంలో ఉన్న బాలాలయం, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అనువైన స్థలం కోసం మంగళవారం పరిశీలన చేశారు. భక్తులు కొనుగోలు చేసి, పూజలు జరిపించే వాహన పూజల స్థలాన్ని కొండపైనే ఏర్పాటు చేయాలని పలువురి భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రధానాలయం పునః నిర్మాణం సమయంలో వాహన పూజల స్థలాన్ని కొండ కిందకు ఆలయాధికారులు మార్చారు. ప్రస్తుతం కొండ కింద గల మూడో ఘాట్ రోడ్డు పక్కన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వద్ద వాహన పూజలను కొనసాగిస్తున్నారు. త్వరలోనే కొండపైనే వాహనాల పూజలను ప్రారంభించనున్నారు.

చోరీ చేస్తూ పట్టుబడిన దొంగ


దొంగకు దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

భువనగిరి క్రైం : ఇంట్లో చోరీకి పాల్పడుతూ పట్టుబడ్డాడు ఓ దొంగ. మంగళవారం రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి గ్రామానికి చెందిన కొత్త సుమన్ రాయగిరిలో సోడాలు అమ్ముకుంటూ సోమ రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్ సమీపంలో కిరాయికి ఉంటున్నాడు. రోజువారీగా ఇంటికి తాళం వేసి సోడాలు అమ్మేందుకు వెళ్లిన సమన్. అదే సమయంలో భువనగిరి పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన దండు శ్రీను సుమన్ కిరాయికి ఉంటున్న ఇంటి తాళాన్ని ఇనుపరాడ్డుతో పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.2,800 దొంగిలించాడు. కాగా ఈ దొంగతనాన్ని పక్కింట్లో ఉన్న వ్యక్తి గమనించి ఇంటి యజమానికి, స్థానికులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు వచ్చి దొంగ ఇంట్లోనే ఉండగా పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం రూరల్ పోలీసులకు అప్పగించారు. సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. కాగా నిందితుడిపై గతంలో భువనగిరి పట్టణం, రూరల్ పోలీస్ స్టేషన్‌లో మోటర్ సైకిల్ దొంగతనాల కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించారు.

రేవంత్‌రెడ్డి ఆటలో కోమటిరెడ్డి బ్రదర్స్ పావులు

- బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్


మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

నల్లగొండ టూటౌన్: భువనగిరి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తేనే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ఆశ చూపాడని, రేవంత్‌రెడ్డి ఆడుతున్న రాజకీయ చందరంగంలో కోమటిరెడ్డి బ్రదర్స్ పావులుగా మారారని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనకు మంచి మిత్రుడే అని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి పదవి ఆశ చూపడంతో తనపై పరుష పదజాలం ఉపయోగించడం సరికాదన్నారు. తాను భువనగిరి ఎంపీగా ఉన్న సమయంలో రూ.9వేల కోట్ల నిధులు తెచ్చానని, రాజగోపాల్‌రెడ్డి ఎంపీగా ఉండి ఏం తెచ్చాడని ప్రశ్నించారు. ఎంపీ, ఎమ్మెల్యే పదవి రాజగోపాల్‌రెడ్డి వ్యాపారాలకు విజిటింగ్ కార్డుగా పనికొస్తుందన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే 6 నెలల్లో ఎయిమ్స్ పూర్తిచేయిస్తానని తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం, ఉదయ సముద్రం ఎందుకు పూర్తిచేయలేదో చెప్పాలన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి నక్కలగండి, చర్లగూడెం, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీరు రాకుండా రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గతంలో ఆయన ఎంపీగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధికి సంబంధించిన వివరాలతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నేత గోలి మధుసూదన్ రెడ్డి, పోతెపాక సాంబయ్య, పిల్లి రామరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగం

- సాగు, తాగునీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు సతమతం
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

దేవరకొండ: రాష్ట్రంలో పాలన అగమ్యగోచరంగా తయారైందని, పంటలు ఎండిపోయి అన్నదాతలు ఆగమయ్యారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మేము గేట్లు ఎత్తితే బీఆర్‌ఎస్‌లో ఎవరూ మిగలరని మాట్లాడే కాంగ్రెస్ నాయకులు.. ఎత్తాల్సింది పార్టీ గేట్లు కాదు.. ప్రాజెక్టుల గేట్లు ఎత్తి రైతులకు సాగు నీరందించాలన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి జగదీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పంటలు ఎండిపోతే ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు పట్టించుకోలేదని విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 200మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రభుత్వానికి చలనం లేకుండా పోయిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సాగు, తాగునీటి సమస్యలతో పాటు విద్యుత్ సమస్యలు మళ్లీ దాపురించాయని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు సాగు, తాగునీటి కష్టాలు రాకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన గుర్తుచేశారు. ఎండిన పొలాలను కేసీఆర్ స్వయంగా పరిశీలించి రైతుల బాధలు విన్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దేవరకొండ నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, నాయకులు నరసింహారెడ్డి, గాజుల ఆంజనేయులు, వడ్త్య రమేష్ నాయక్, టీవీఎన్ రెడ్డి, నేనావత్ కిషన్‌నాయక్, బీల్యానాయక్, పల్లా ప్రవీణ్ రెడ్డి, సునితాజనార్దన్‌రావు, ఏడ్పుల గోవిందు, వలపురెడ్డి, చింతపల్లి సుభాష్, కంకణాల వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వరావు, ఆయా మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'డిండి' నీటి విడుదల.. రైతుల ఆందోళన

- నీటి విడుదలను తగ్గించిన ఇరిగేషన్ అధికారులు


డిండి మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

డిండి: డిండి ప్రాజెక్టు నుంచి సోమవారం ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయగా.. నీటి విడుదలను నిలిపివేయాలని పలువురు రైతులు మంగళవారం డిండి మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఇరిగేషన్ డీఈ శ్రీనువాసులుకు వినతిపత్రం అందజేశారు. రైతుల ఆందోళనతో డీఈ ప్రాజెక్టు వద్దకు వెళ్లి నీటి విడుదలను సగం వరకు తగ్గించారు. పూర్తిస్థాయిలో నీటి విడుదలను నిలిపివేయాలని రైతులు డీఈపై ఒత్తిడి తీసుకురాగా.. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రాజు తన సిబ్బందితో కలిసి ప్రాజెక్టు వద్దకు చేరుకుని రైతులకు సర్ది చెప్పడంతో సమస్య సద్దుమనిగింది.

భూగర్భ జలాలు పెంచేందుకు..

వానాకాలంలో డిండి ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీరు రావడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టం 36 అడుగుల వరకు చేరింది. యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు ఆయకట్టులో పొలాల సాగుకు నీటిని విడుదల చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేయగా.. ఆయకట్టులోని మొత్తం 12750 ఎకరాలకు నీరు సరిపోదని వానాకాలంలో మాత్రమే నీటిని విడుదల చేయాలని మరికొంత మంది రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మెజార్టీ రైతుల అభిప్రాయం మేరకు నీటి విడుదలను ఆపేశారు. ప్రస్తుతం వేసవి కారణంగా బోరు బావుల్లో నీరు అడుగంటిపోవడంతో భూగర్భజలాలను పెంచడంతో పాటు డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చెరువులు, కుంటలు నింపడానికి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు. కానీ, డిండి మండల రైతుల అభిప్రాయ సేకరణ లేకుండా ప్రాజెక్టు నుంచి నీటిని ఎలా విడుదల చేస్తారని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నిల్వ ఉన్న 29 అడుగుల మేర నీరు మొత్తం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసినా డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని చివరి చెరువులు, కుంటల వరకు నీరు చేరుకోదని ఇక్కడి రైతులు పేర్కొంటున్నారు. అదే విధంగా ప్రాజెక్టు మెయిన్ కెనాల్‌కు ఉన్న పలు డిస్ట్రిబ్యూటరీలకు తలుపులు లేకపోవడంతో విడుదల చేసిన నీటిలో సగం వరకు వృథాగా పోతున్నాయని రైతులు వాపోతున్నారు. వానాకాలం ఆయకట్టు సాగుకు ప్రాజెక్టులో నీరు లేకుండా ఉంటుందని, ప్రస్తుతం నీటిని విడుదల చేయడం వలన ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

యాదాద్రిలో నేడు సీతారాముల కల్యాణం

- శివాలయంలో వైభవంగా ఎదుర్కోలు ఉత్సవం


ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న పూజారులు

యాదగిరిగుట్ట : శ్రీరామనవమిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శివాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వార్లను ప్రత్యేక సేవపై ఊరేగించారు. అనంతరం ఆలయ మండపంలో సీతాదేవి – శ్రీరాముడి పక్షాన ఆలయ అధికారులు, వేద పండితులు, పారాయణీకులు, అర్చకులు, పూజారులు వేర్వేరుగా కూర్చోని కల్యాణ వేడుకకు సమయాన్ని నిర్ణయించారు. అనంతరం నివేదన, నీరాజన, మంత్ర పుష్పములు జరిపించి, ఎదుర్కోలు ఉత్సవానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు శ్రీసీతారాముల కల్యాణం..

వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివాలయంలో బుధవారం శ్రీసీతారామచంద్రస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు పూజారులు, వేద పండితులు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12గంటలకు శివాలయ కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గురువారం శ్రీసీతారామచంద్రస్వామి వారి పట్టాభిషేక మహోత్సవాన్ని మధ్యాహ్నం 12.30గంటలకు శివాలయంలో నిర్వహించనున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్ : భార్యతో మనస్పర్థల కారణంగా ఒంటరిగా నివసిస్తున్న వ్యక్తి మనస్తాపంతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం వద్ద జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొత్తపేట గ్రామ సమీపంలోని ఎర్రకాలువ తండాకు చెందిన తేజావత్ నర్సింహ (35)కు జాలుబావితండాకు చెందిన యువతితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. నర్సింహ కూలీ పనులతో పాటు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి భార్య ఇళ్లలో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఏడాది క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి ఎవరికి వారే విడిగా ఉంటున్నారు. నర్సింహ భార్య బతుకుదెరువు నిమిత్తం తన పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఇళ్లలో పనిచేసుకుంటూ నివసిస్తోంది. భార్య విడిగా ఉంటుండడంతో మనస్తాపానికి గురైన నర్సింహ మంగళవారం మిర్యాలగూడ మండలం అవంతీపురం వద్ద గల బాలాజీ టౌన్‌షిప్‌లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి తేజావత్ లాలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనాథ వృద్ధుడికి గ్రామస్తుల అంత్యక్రియలు


మోహన్‌రావు అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

హాలియా: అనుముల మండలంలోని పేరూర్ గ్రామంలో సోమవారం అనాథ వృద్ధుడు మృతిచెందగా.. మంగళవారం గ్రామస్తులంతా కలిసి అతడి అంత్యక్రియలు నిర్వహించిన మానవత్వం చాటుకున్నారు. వివరాలు... పేరూర్ గ్రామానికి చెందిన మోహన్‌రావు(65) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయన 30 ఏళ్ల క్రితం పేరూర్ గ్రామానికి వలస వచ్చాడు. గ్రామంలోనే నివాసముంటూ యాచకుడిగా జీవనం సాగిస్తున్నాడు. మోహన్‌రావుకు ఎవరూ లేకపోవడంతో గ్రామస్తులతో కలివిడిగా మెలిగేవాడు. సోమవారం మోహన్‌రావు మృతిచెందగా.. అతడికి బంధువులు ఎవరూ లేకపోవడతో గ్రామస్తులే విరాళాలు సేకరించి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.